

సచ్ఛిదానంద సద్గురు

# సాయివాణి

ధార్మిక, సామాజిక మాస పత్రిక

(సాయి సేవాసమితి ప్రచురణ)

సంపుటి : 15 మార్చి, 2019 సంచిక : 10

**సంస్థాపకులు :**
**శ్రీశ్రీశ్రీ స్వామీ సత్యపదానంద ప్రభుజీవారు**

**సంస్థాపక సంపాదకత్వం :**
**శ్రీ మాతా శుకవాణి**

**ప్రధాన సంపాదకత్వం :**
**బ్రహ్మచారి శ్రీ సాయి రామచైతన్య** M.A.

**ప్రచార సారథ్యం**
**శ్రీ ఎం. సత్యనారాయణ** M.Tech.

**ప్రత్యేక సహకారం**
**డా॥ జి.చంద్రారెడ్డి** M.A, M.Ed., Ph.D
**శ్రీ వి.వి. కృష్ణారావు (సాయిశ్రీ ప్రింటర్స్)**

**సాయివాణి చందా వివరాలు**

| | | |
|---|---|---|
| వార్షిక చందా ... | రూ॥ | 100/- |
| ద్వైవార్షిక చందా. ......... | రూ॥ | 200/- |
| ఆజీవ సభ్యత్వం ......... | రూ॥ | 1000/- |

**చిరునామా :-**

**సాయివాణి**

C/o **శ్రీ సాయీ సేవా సమితి ట్రస్టు**
సాయిధామం, పెద్ద పర్వతాపురం గ్రా,
రామలింగంపల్లి(పోస్టు),
బొమ్మల రామవరం మండలం,
యాదాద్రి భువనగిరి జిల్లా-508 126.
**Ph : 9440413455, 9848133565**

**విషయసూచిక** **పుట సంఖ్య**

మా వాణి ............ 2
ఆశకు అంతం లేదా ............ 5
మాతృసంస్థ కబుర్లు ............ 10
శిష్య లక్షణాలు ............ 14
దేశం-ధర్మం ............ 17
జనాబాయి ............ 19
DECLARATION ............ 21
జ్ఞానధామం-3 నిర్మాణం ............ 22
గురుదేవుల 80వ జన్మదినం ...... 24
మువ్వల మురళి ............ 25
అందరికీ స్మార్తం నేర్పబడును ..... 29
సాయి సేవక్-శ్రీ శివనేశన్ ......... 30

ఈ పత్రికలోని రచయితల అభిప్రాయాలు వారి వ్యక్తిగతమైనవి. పత్రిక యాజమాన్యానికి బాధ్యత లేదు.







# మా వాణి



## సాయి - శివుడు

శ్రీ సమర్థ సాయిదేవుల పాదపద్మాలకివే ప్రణామాలు.

సాధారణంగా సాయీ సత్సంగాలలో పూజ, సాయి చరిత్ర పఠనం, దాని మీద చర్చగానీ, ప్రవచనంగానీ, కొంత భజన ఉంటాయి. వీటిలో పూజ, భజన-భక్తి మార్గానికీ, పఠన అధ్యాయనాలు-జ్ఞాన మార్గానికి చెందినవి. ఆ స్వామి చెప్పిన రీతిలో సకల ప్రాణి సంసేవనం చేస్తూ జీవించడం కర్మ యోగానికి చెందినట్టిది. అయితే-వీటికన్నిటికీ మౌలికమై మనకు సత్ఫలితాల నివ్వగలిగేది 'ఆత్మ విచారం' లేదా 'విచారణ'.

మామూలుగా ఎవరైనా ఉన్నత వ్యక్తులు ఏదైనా ప్రవచిస్తున్నప్పుడు-వింటున్నవాళ్ళు "ఇది నాకు అన్వయిస్తుందా? నేను వారు చెప్తున్న రీతిలో ఉన్నానా? అయా లోపాలు నాలో లేకుండా నేను చూచుకొంటున్నానా?"-అని ఆలోచించుకోవాలి. ముఖ్యంగా బాబా వారి ఉపదేశాలు భక్తి, కర్మ, జ్ఞాన యోగాల మేలి మేళవింపుగా ఉంటాయి. మనకు ఆయన పట్ల ఉన్న గౌరవాభిమానాలను ప్రదర్శించేందుకు మనకున్న ఒకే ఒక్క మార్గం-ఆయన ఉపదేశాలను ఆచరించటమే.

సాయి సాటి వారిని నిందించవద్దన్నారు. కష్టానికి తగిన కూలీ ఇమ్మన్నారు. విషయ భోగాలు ఏవి అనుభవిస్తున్నా మొదట భగవదర్పితం చేయమన్నారు. నిద్ర, అలసత్వము వదలమన్నారు. సకల జీవులలోనూ తనను చూడమన్నారు! మనం యివేవీ చేయకుండానే 'నేను సాయీ

భక్తుడ'ను అని ఎలా చెప్పకోగలం?

మనను లొంగదీసుకొని, స్వారీ చేసే దురలవాట్లు, బలహీనతలు కొన్ని ఉంటాయి. వాటిని క్రమంగా సాయికి అర్పించి చేతులు కడుక్కొంటూ ఉండాలి, ఆ తండ్రి మన దగ్గరున్న మంచి మంచి వస్తువులు, గుణాలు ఏవీ అడగటం లేదు గదా! మనను నాశనం చేసే అవలక్షణాలేవైనా ఉంటే-వాటిని మాత్రమే తనకిమ్మంటున్నారు. అవి యిచ్చేస్తే మనం నిర్మలులం, పరిశుద్ధులం అవుతాము. అప్పడాయన మనలో సుస్థిరంగా నెలకొని ఉండగలరు. బాహిరమైన దురలవాట్లు మద్యసేవనం, పొగ త్రాగటం వంటివి యిలా వదులుకోవచ్చు. ఇవిగాక అంతర శత్రువులను జయించాలి గదా! దానికి ఆత్మవిచారం ఎంతగానో సహకరిస్తుంది.

సత్సంగాలలో పాల్గొన్నప్పడు-'అక్కడ విన్న దానికి మనమెంతవరకు సరిపోతాం' అని ఆలోచించుకొంటూ ఉండాలి. నేను అంటే శరీరం కాదు ఆత్మ, సత్యమైన నేను ఆత్మ, మాయా (భ్రమ). నేను శరీరరం, శరీరం అస్థిరమూ, నశ్వరమూ ఐనది. ఆత్మ ఒక్కటే శాశ్వతమైనదీ, సత్యమైనదీను. ఇది మనందరికీ తెలుసు. ఈ ఆత్మ నిరంతరం ఆనందంలో మునిగి ఉంటుంది. దాన్ని దుఃఖంలోకి లాగే ప్రయత్నాలు యీ కామ క్రోధ లోభ మోహ మద మాత్సర్యాలు చేస్తుంటాయి. అంచేత క్షణక్షణం మనం యీ శత్రువులు మన లోలోపల ప్రవేశించి ఏం చేస్తున్నారో ఒక కంట కనిపెడుతూ ఉండాలి. మన జీవన విధానాన్ని చిన్నచిన్న విభాగాలుగా చీల్చి ఆ పొరల మధ్య దాక్కొని యీ శత్రువులు ఎక్కడెక్కడున్నారో పరీక్షించుకోవాలి. అటుపైన వాటికి మూలకారణాలు వెదికి పట్టుకోవాలి. వాటిని సమూలంగా నాశనం చేయాలి. అప్పడుగానీ వీళ్ళంతా నశించరు.

ఉదాహరణకు చూద్దాం-కామం అంటే ఏవో రకరకాల కోరికలున్నా





యనుకుందాం. ఆ కోరికలు తీరకపోతే క్రోధం వస్తుంది. ఆ కోరిక తీర కుండా అడ్డుపడే వాళ్ళ మీదా, ఆ పరిస్థితుల మీదా విరుచుకుపడతాం. ఒకవేళ మనకు దక్కకుండా ఆ వస్తువు మరొకరికి దక్కితే వారి పట్ల మాత్సర్యం. పొరపాటున మనకే దక్కితే దాన్ని దాచేసుకోవాలి, తనకే సొంతం చేసుకోవాలి-అన్న లోభం.

అటుపైన దాన్ని ఎన్నడూ విడువలేనంత మోహం, దాన్ని పొందిన అహం భావంతో మదం-ఇవన్నీ ఒక దాని వెనుక ఒకటిగా బయలుదేరి వచ్చేస్తాయి. దీనంతటికీ మూలకారణం ఏమిటి? కోరిక, కామం, ఇంతకీ ఆ కామఫలాన్ని అనుభవించేదెవరు? శరీరం. దాన్ని పొందటానికి పడిన యాతనలు, ఆపైన అంటుకున్న అవగుణాలు-వీటన్నిటి ఫలితం దుష్ట సంస్కార రూపంలో ముద్రపడేది ఎవరిమీద? ఆత్మ మీద. అంటే అశాశ్వతమైన శరీరాన్ని తృప్తిపరచటం కోసం శాశ్వతమైన ఆత్మను మురికి చేసుకొంటున్నాం. మరో రకంగా చెప్పాలంటే - మాయ 'నేను' మీది భ్రమతో నిజమైన 'నేను'కి ద్రోహం చేసుకుంటున్నాం. తత్ఫలితంగా పై జన్మలోని జీవితాన్ని కూడా చేదు చేసుకున్నవాళ్ళమవుతున్నాం. (ఈ జన్మలోని కర్మల ద్వారా ఏర్పడిన మంచి, చెడు సంస్కారాల ఫలమంతా వచ్చే జన్మలో అనుభవించక తప్పదని శాస్త్రాలు నిష్కర్షగా చెప్తున్నాయి. ఇలా ఆలోచించు కోవటమే ఆత్మ విచారం.

అందుచేత యికపైన మనలో ప్రతి ఒక్కరం మన చెవినబడిన ప్రతి మంచి వాక్యాన్ని విశ్లేషించి అర్థం చేసుకొని, మన జీవితం తదనుగుణంగా ఉందో లేదో సరిచూచుకొని, ఆత్మ విచారంలో స్వచ్ఛ సంస్కారాలనే పెంచుకొనే ప్రయత్నం చేద్దాం.

# ఆశకు అంతం లేదా?

ఒక అభాగ్య బ్రాహ్మణుడు కడు పేదరికంతో బాధపడుతూ తమ గ్రామానికి వచ్చిన ఓ సాధుపుంగవుణ్ణి సందర్శించుకొని తన గోడును వెళ్లబోసుకున్నాడు. ఎన్నో మహిమలున్న ఆ స్వామీజీ ఆ దీనార్తుడి కష్టానికి కరిగిపోయి ఎలాగైనా సహాయం చేయాలనుకుంటాడు. కళ్ళు మూసుకొని తన దివ్యదృష్టితో ఆ రాజ్యంలోని ఓ అటవీ ప్రాంతంలో నాణాల రాశులున్నాయని తెలుసుకుంటాడు. వెంటనే ఆ పేద బ్రాహ్మణుణ్ణి అక్కడకు వెళ్ళి, తనకు కావలసినంత సొమ్ము తెచ్చుకొని హాయిగా జీవించమని ఉపదేశించాడు. ఆ సాధువు మాట ప్రకారమే బ్రాహ్మణుడు ఆ చోటుకు వెళ్ళి, తన కుటుంబానికి కావలసినన్ని నాణాలు తెచ్చుకొని తృప్తిగా జీవించసాగాడు.

ఈ విషయం బ్రాహ్మణుడి ఇంటిపక్కనున్న ఓ నూనె వ్యాపారికి తెలిసింది. శ్రీమంతుడే అయినప్పటికీ అతనికి దురాశ పుట్టుకొచ్చింది. నిరుపేదగా వేషం వేసుకొని, సాధువు వద్ద దీనంగా ధనం కోసం అర్థించాడు. సాధువుకు అతని దుర్బుద్ధి తెలిసినప్పటికీ, అతనికి గుణపాఠం నేర్పాలని వందల మైళ్ళ దూరంలో ఉన్న నాణాల నిధుల జాడ చెప్పాడు. ఒకానొక రోజు ఇంట్లో వాళ్లకు కూడా చెప్పకుండా, నిధులున్న చోటికి ఆ వ్యాపారి వెళ్ళిపోయాడు. ఎంతో శ్రమకోర్చి అక్కడికి చేరుకొని, అక్కడ రాజముద్రికలున్న నాణెల రాశులను చూసి మంత్రముగ్ధుడయ్యాడు. వాటిని సంచుల్లో నింపుకొని, మూట కట్టుకోవడం మొదలుపెట్టాడు. ఎన్ని మూటలు కట్టుకున్నా ఆశ తీరడం లేదు. ఇలా రోజులు, వారాలు, నెలలు, సంవత్సరాలు గడిచిపోయాయి. యుక్తవయస్సులో ఆ ప్రాంతంలో అడుగు





పెట్టిన వ్యాపారి, వృద్ధాప్యానికి చేరుకున్నాడు. చివరకు తన శక్తికి మించిన నాణాల బస్తాలను తీసుకుని గ్రామానికి వచ్చాడు. అప్పటికే అతని కొడుకులు, కూతుళ్ళు కన్నుమూశారు. మనుమలేమో ఈ లోభిని అసలు గుర్తే పట్టలేదు. రాజ్యాలు మారిపోయి దురదృష్టవశాత్తూ ఆ నాణెలు కూడా చెల్లుబాటు కాకుండాపోయాయి. ఈ మాత్రం దానికి ఇన్నేళ్ళు శ్రమించానా అనుకుంటూ, ఆ లోభి గుండె ఆగి చనిపోయాడు.

ఈ రోజుల్లో కూడా ఇలాంటివారు లెక్కకు మించి ఉన్నారు. ఆయువు తగ్గుతున్నా ఆశ మాత్రం ఎనిమిది చేతుల ఆక్టోపస్‌లా అల్లుకుపోతోంది. ఇలాంటి ప్రమాదాన్ని ముందే ఊహించి, జగద్గురువులు శంకరాచార్యులు తన 'భజ గోవింద స్తోత్రం'లో...

**దిన యమిన్యౌ సాయం ప్రాతః శిశిర వసన్తౌ పునరాయాతః।**

**కాలః క్రీడతి గచ్ఛత్యాయుః తదపిన ముంచ త్యాశా వాయుః ...**

అన్నారు. పగలు, రాత్రి, ఉదయం, సాయంత్రం, శిశిరం, వసంతం వస్తూ ఉంటాయి, పోతూ ఉంటాయి. కాలం ఆడే ఆటలో ఆయువు తరిగిపోతూ ఉంటుంది. అయినా మానవుడు ఆశను మాత్రం వదిలిపెట్టడని ఆవేదన వ్యక్తం చేశారు. ఆధునిక ప్రపంచంలో అంతం లేని ఆశలతో మనిషి పెడుతున్న పరుగులు విపరీత పరిణామాలకు దారితీస్తున్నాయి. ఓవైపు కాలం నిశ్శబ్దంగా తన ప్రతాపాన్ని చూపిస్తూ, పాఠాలు నేర్పుతున్నా మనకు కాదులే అన్నట్లు ప్రవర్తిస్తూ ఉన్నాం.

**పగటి వెంటే రాత్రి.... ప్రాభవం వెనకే పతనం!** : కోటి సూర్యప్రభలతో అరుణోదయమైనా, అది మాపటికి మౌనంగా అస్తమించాల్సిందే! వసంతం ఎన్ని పూలవానలు కురిపించి, మురిపించినా, శిశిరం రాగానే కొమ్మలు మోడు వారాల్సిందే! మనుషులకైనా, మానులకైనా ఇదే కాలనియమం. మానవుడు తప్ప, సృష్టిలోని అన్ని ప్రాణులూ ఈ శాశ్వత సత్యాన్ని మరచిపోకుండా,

కాలానికి క్రైమోడ్చి మసలుకుంటున్నాయి. మనిషి మాత్రం, ఆ కాలభ్రమణానికి విరుద్ధంగా, తానొక చిరకాల జీవిననుకుంటూ వెర్రి ఆశలతో జీవిస్తున్నారు. అందుకే శ్రీ మద్భాగవతంలో భీష్మాచార్యులు ఇలా అంటారు:

**వాయువశంబులై ఎగసి వారిధరంబులు మింట కూడుచుం**

**బాయుచు నుండు కైవడి ప్రపంచము సర్వము కాలతంత్రమై**

**పాయుచు కూడుచుండు నొకభంగిచరింపదు కాలమన్నియుం**

**చేయుచు నుండు కాలము విచిత్రము దుస్తరమెట్టి వారికిన్ ....**

ఆకాశంలోని మేఘాలు గాలికి ఎగిరి పరస్పరం కలుసుకుంటూ, విడిపోతూ ఉన్నట్లు, ఈ ప్రపంచంలోని ప్రాణికోటి సమస్తమూ కాలచక్రం వల్ల కూడుతూ, వీడుతూ ఉంటుంది. స్వేచ్ఛ అనేది లేదు. కాలమే అన్నిటికీ మూలం. కాలం చాలా విచిత్రమైనది. ఎంతటివారైనా ఈ కాలప్రవాహాన్ని దాటలేరని స్పష్టం అవుతుంది.

కానీ, మనం అవివేకంతో సమస్తాన్నీ మన ఆధీనంలోకి తెచ్చుకోవాలని వృథాగా ప్రయాసపడుతూ ఉంటాం. కాలం పెట్టే పరీక్షలో ఓడిపోతూ ఉంటాం. సమాజంలోకాని, కుటుంబంలో కాని నిరంతరం మనం నిమిత్త మాత్రుల్లా వ్యవహరిస్తూ ఉండాలి. కాలప్రవాహంలో ఏ పరిణామాన్నైనా హుందాగా స్వీకరించాలి. అది ప్రాభవం కావచ్చు; పతనం కావచ్చు. ఏదైనా మన ప్రారబ్ధం అనుకొని స్థైర్యంగా నిలబడాలి.

**ఆశతోనే అశాంతి :** ఈ రోజు మనలో అశాంతికి ప్రధాన కారణం - ఆశ. జీవితానికి సంబంధించి, మనం ఓ ఆశల పల్లకీని నిర్మించుకుంటాం. రంగురంగుల పూలతో అలంకరించుకుంటూ ఉంటాం. అలాగే పల్లకీ సాగిపోవాలని కలలు కంటూ ఉంటాం. కానీ, చాలా సందర్భాల్లో ఆ కలలు నెరవేరనప్పుడు మనం అశాంతి పాలవుతాం. అందువల్ల 'శంకరాచార్యులు





'ఆశించే స్థాయిలోనే మనస్సును అప్రమత్తంగా ఉంచమంటున్నారు'. మన ఆయువెంత? దాంట్లో మనం అనుభవించేదెంత? అని ఎవరికి వారే ప్రశ్నించుకోవాలి. కళ్ళు చల్లగా ఉండాలంటే అద్దాలు కళ్ళకే పెట్టుకుంటాం; ప్రపంచాన్ని అంతా చల్లబరచలేం కదా! అలాగే లోకంలో కనిపించేవన్నీ అనుభవించాలన్న ఆశ కన్నా, వాటిని కోరుకునే మనస్సునే కట్టడి చేయాలన్న ఇంగితజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి. అందుకే చాణుక్యుడు తన నీతి సూత్రాల్లో ....

**శాన్తి తుల్యం తపోనాస్తి న సంతోషాత్పరం సుఖమ్।**

**న తృష్ణాయాః పరో వ్యాధిర్నచ ధర్మో దయాపరః ॥**

అంటాడు. శాంతితో సమానమైన తపస్సు మరొకటి లేదనీ, సంతోషాన్ని మించిన శ్రేష్ఠమైన సుఖం మరొకటి ఉండదనీ, ఆశకు మించిన వ్యాధి మరొకటి లేదనీ, దయను మించిన ధర్మం లేదనీ వివరిస్తారు. కానీ, ఈ రోజుల్లో చాలామందికి నిజంగా శాంతి, సంతోషం ఎక్కడ లభిస్తాయో తెలియదు. భగవాన్ శ్రీరామకృష్ణులు చెప్పినట్లు, వెలుగుతున్న లాంతరును మన చేతిలోనే పట్టుకొని, పక్కింట్లో నిప్పు కోసం అర్థించే అమాయకుల్లా మారిపోతున్నాం. చేతిలో దీపం ఉన్నా కూడా అవివేకి, ఆ స్పృహలేక చుట్ట కాల్చుకోవడానికి నిప్పు కోసం పక్కవారిపై ఆధారపడ్డాడు. మనం కూడా ఆనందం మన మనస్సులో ఉంటే, దాని కోసం కార్లలో, బ్యాంకు ఖాతాల్లో, రాజభవనాల్లో, ఖరీదైన వస్త్రాల్లో వెతుక్కుంటున్నాం. అలాగని వాటిని వేటినీ సముపార్జించుకోవద్దన్నది ఆది గురువుల అభిప్రాయం కాదు. కానీ, అవి ఉంటేనే సంతోషంగా ఉంటామనుకోవడం అవివేకం.

**మాటు వేసిన మృత్యువు :** మనం మరచిపోయే మరో ముఖ్యమైన అంశం - మృత్యువు. అది రోజురోజుకూ మనకు దగ్గరవుతుందని గుర్తించం.

పోయిన వాళ్లను చూసి పోతున్న వాళ్ళు ఏడ్చినట్లు, చనిపోయిన వారి ముందు నాలుగు కన్నీటి చుక్కలు కారుస్తాం. కానీ, మనం కూడా పోయే రోజు తప్పక వస్తుందనీ, ఆలోపు మన కోసం మనమే బ్రతకడం కాకుండా, కొంతైనా ఇతరుల కోసం బ్రతుకుదామని ఆలోచించం. 'అందరూ వెళ్లిపోతారు, నేను, నా పిల్లలు, నా మనుమళ్ళు, మనుమరాళ్ళు మాత్రమే శాశ్వతంగా ఉండి, ఈ ప్రపంచాన్ని అనుభవింపచేస్తాం' అన్నంత ధీమాతో మనలో చాలామంది స్వార్థపూరితులుగా జీవిస్తూ ఉంటారు. అందుకే ఓ మారు శ్రీరామచంద్రుడు విశ్వామిత్రుడితో "పిల్లి ఎలుకను ప్రియంగా చూస్తున్నట్లు ఒక ప్రక్క మృత్యువు ప్రాణిని మింగివేయడానికి మహాభి లాషతో నిరంతరం చూస్తూ ఉంది. అయినా ఓ మహాశయా! ముసలి నర్తకి ఏ మాత్రం తనకు ఆనందం లేకపోయినా నృత్యం ఆపలేక పోయి నట్లు, ఈ 'ఆశ' అనేది పొందే తృప్తి ఏదీ లేకపోయినా, ఈ సంసా రారణ్యంలో తన చపల సంచలనం మాత్రం మానలేకపోతోంది. సంసారంలోని దోషాలన్నింటిలో ఇది అతి తుచ్ఛమైనది. ఇది ఉన్నంత వరకు మాకు మోహపూరితమైన పాట్లు తప్పవు" అంటాడు. ఆదిశంకరులు చెప్పినా, శ్రీరామచంద్రుడు చెప్పినా ఒక్కటే - ఆశలపాశాన్ని ఎంత తుంచి వేస్తే, మనిషికి అంత మనశ్శాంతి! గద్ద నోట్లో చేప ఉన్నంత కాలం కాకులు దాన్ని వెంబడిస్తూనే ఉంటాయి. చేపను జారవిడిచి కొమ్మపై కూర్చున్న మరుక్షణమే దానికి విశ్రాంతి; ప్రశాంతి! అలాగే మనిషికి ఆశలున్నంత కాలం ఈ అలుపెరుగని పరుగులూ తప్పవు; పడిపోవడాలూ తప్పవు. ఒక వయస్సు వరకు సంసారాన్ని ఓ చేతితో, భగవంతుడిని మరో చేతితో పట్టుకోవాలి; అయిన వారంతా ఓ స్థాయికి వచ్చాక, రెండు చేతులతో ఆ పరమాత్ముడి పాదాలనే పట్టుకోవాలి. అప్పుడే ప్రశాంతం.......... పరమానందం!





# మాతృసంస్థ కబుర్లు

శ్రీ సాయి విద్యాధామం, సాయిధామం ఆశ్రమ పాఠశాలలో జనవరి 26న గణతంత్ర దినోత్సవ సందర్భంగా ఉదయం గం.8.00లకు పాఠశాల ఆవరణమంతా కోలాహలం. రంగురంగుల సీతాకోక చిలుకల్లా పిల్లల పరుగులు, దేశభక్తి గీతాలాపనలు, కొత్త ఉత్సాహం. గం.9.00లకు పిల్లలంతా భారతమాతని స్తుతిస్తూ భారతమాత మంటపం దగ్గర నమస్కారం చేస్తూ అమ్మా... ఈ దేశాన్ని దుర్మార్గుల నుండి కాపాడుకునే శక్తిని మాకివ్వమ్మా అని వేడుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా శ్రీకాకుళం జడ్జి గారైన శ్రీమతి సుధామణిగారు విచ్చేసారు. విశ్వకళా పరిషత్ ఛైర్మన్ గారైన శ్రీ సాయిరామ చైతన్యగారు, ట్రస్టు సభ్యులైన మాన్యులు శ్రీ ఆనందం మామయ్యగారు, శ్రీమతి ఝాన్సీలక్ష్మీగారు వేదికనలంకరించారు. శ్రీ సాయి రామ చైతన్యగారి ఆధ్వర్యంలో శ్రీమతి సుధామణిగారి కరకమ లములచే పతాకావిష్కరణ కార్యక్రమం జరిగింది. శ్రీమతి సుధామణిగారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ చదువుకోవాలి, దేశ ఉత్తమ పౌరులుగా ఎదగాలని విద్యార్థులకు చెప్పారు.

అనంతరం ఛైర్మన్‌గారు మాట్లాడుతూ రాజ్యాంగాన్ని ఎలా ఏర్పరచు కున్నాం, చట్టాలు ఎలా వచ్చాయి, హక్కులతోపాటు బాధ్యతలని ఎలా నిర్వర్తించాలో చెప్పారు. సనాతన ధర్మాన్ని ఆచరణ చేస్తూ ఎవ్వరికీ ఇబ్బంది కలిగించకుండా జీవించే విధానం ఉంది. ప్రజల్లో కల్మషాలు వచ్చేసి అసూయా ద్వేషాలు పెరిగిపోయి ఒకడంటే ఒకడికి పడక బానిసత్వానికి గురైపోయి మనం పీడించబడుతున్నప్పుడు ఇలా కాదు దాన్ని శాసనం ద్వారా చేసుకుంటేనే బాగుంటుందనే ఉద్దేశ్యంతో పెద్దలందరూ మనకు రాజ్యాంగాన్ని ఏర్పాటు చేసారు. 200 ఏళ్ళు బానిసత్వానికి అలవాటు పడిన మనం స్వాతంత్ర్యం వచ్చినా ఆ బానిసత్వపు ఆలోచనలు వస్తూనే ఉన్నాయి.

అలాంటప్పుడు అసలు నేను ఎవరు, నేను ఏమి ఆలోచిస్తున్నాను, ఏ దేశంలో నివసిస్తున్నాను, నా పూర్వీకుల వారసత్వం ఏమిటి? అని తెలుసు కోలేక జీవిస్తున్నాం, చదువుతున్నాం, జీవితాలు గడిపేస్తూనే ఉన్నాం. విదేశీయులు మన సంస్కృతిని ఆచరిస్తున్నారు కాని మనం మాత్రం మర్చిపోతున్నాం. ఏది ఏమైనా కన్నతల్లిలాంటి మాతృభూమిని, వారసత్వాన్ని మర్చపోకండి. వెయ్యి కళ్లతో దేశాన్ని కాపాడుకోవలసిన అవసరం ఉంది. దేశనాయకులకు, దేశ సంపదలకు, దేశ సౌభాగ్యానికి మనం వారసులం. మనలో మనకి ఎన్ని గొడవలు ఉన్నా, బయటవాడు వచ్చినప్పడు అందరం ఒక్కటే. మా జోలికి వస్తే తంతాం అనేట్టు భారతీయు లందరూ ఉండాలి. నేటి యువతనే రేపు దేశాన్ని పాలించేది. కాబట్టి మంచి నిర్ణయాలు తీసుకుని ముందుకు నడుద్దాం అని ముగించారు.

అనంతరం విద్యార్థులు దేశ భక్తి గీతాలాపనలు, చిన్న చిన్న అభినయ గేయాలు ప్రదర్శించారు.

గం.11.00లకు సాయి కళ్యాణి ఆడిటోరియంలో దేశమాతకు గుర్తుగా కన్నతల్లులను ఆహ్వానించి మాతృపూజ నిర్వహింపజేయడం సాయి విద్యాధామం పాఠశాల ఆనవాయితీ. నేటి సమాజం స్త్రీని భోగవస్తువుగా భావిస్తుంది. నేడు పేపర్లలో, వార్తల్లో స్త్రీకి కలుగుతున్న అన్యాయాలు, అరాచకాలు చూస్తుంటే మన వినాశనాన్ని మనమే కొనితెచ్చుకుంటున్నా మనిపిస్తుంది. ఏ ఆడపిల్లనైనా అమ్మా ... అని పిలిచే దేశం మనది. స్త్రీ అంటే శక్తి స్వరూపిణి. ఆమె తలుచుకుంటే మనం మిగలం. "యత్ర నార్యస్తు పూజ్యంతే రమంతే తత్ర దేవతాః" ఎక్కడ స్త్రీలు పూజింపబడతారో అక్కడ దేవతలు ఉంటారు. ఆ దేవతామూర్తుల విలువను తెలియజేయడమే మా పాఠశాల ఉద్దేశ్యం.

సాయిరామ చైతన్యగారి నిర్వహణలో అమ్మలకు పాదపూజ చేసి పసుపు, కుంకుమ, బహుమతులు ఇచ్చారు. సాష్టాంగ నమస్కారం చేసి అమ్మా నీ మనసు గాయపరిచే ఏ చెడ్డ పనిని మేము చెయ్యమని విద్యార్థులు తల్లులకు మాట ఇచ్చారు. ధర్మారెడ్డి గూడెం చంద్రారెడ్డిగారు





మాట్లాడుతూ ప్రతి తల్లి తన బిడ్డ గొప్పవాడు కావాలనీ, గొప్ప స్థాయిలో ఉండాలనీ కలలు కంటుంది. ప్రస్తుతం తల్లులు పాటిస్తున్న సంప్రదాయాన్ని బిడ్డలకు చెప్పడం లేదు. మన పిల్లలకు కట్టుబొట్టుపైన ఇష్టత లేకుండా ఉంటుంది. విదేశీ సంస్కృతిని విచ్చలవిడిగా అనుసరిస్తూ వినాశనాన్ని కోరి తెచ్చుకుంటున్నారు. పిల్లలు సక్రమ మార్గంలో ఉండి భవిష్యత్తును నడిపించాలంటే తల్లులు బాధ్యత వహించాలన్నారు. అనంతరం సాయిరామ చైతన్యగారు మాట్లాడుతూ ఈ పవిత్ర భారతదేశంలో తల్లి మనస్సు ఎలాంటిదో చిన్న కథ ద్వారా వివరించడంతో మాతృమూర్తు లందరి హృదయాలు కరిగిపోయినాయి. ఢిల్లీకి రాజైనా తల్లికి కొడుకే. సన్యాసి అయినా సరే తల్లి పాదాలకు నమస్కరిస్తాడు. తన ప్రాణాన్ని పణంగా పెట్టి బిడ్డకు జన్మనిస్తుంది. ఎంత చేసినా తల్లి ఋణం తీర్చుకోలేనిది. ప్రతి ఒక్క ధీరుడి వెనుక, విజయం వెనుక తల్లి ఉంటుంది. తల్లి దీవెనలు ఎప్పడూ మనకు ఉండాలి. ఆమె మనసు కష్ట పెట్టరాదు. అదే మనం తల్లికి ఇచ్చే నిజమైన కానుక అని వివరించారు.

అనంతరం వచ్చిన వారందరికి సాయి ప్రసాదం అందించడం జరిగింది.

ఫిబ్రవరి 2వ తేది శ్రీ సాయి విద్యాధామంలో పదవ తరగతి విద్యార్థులకు వీడ్కోలు సభ ఏర్పాటు చేసారు. 10వ తరగతి విద్యార్థులు వారి వారి అనుభవాలను, పాఠశాలకు, వారికి ఉన్న అనుబంధాన్ని, ఉపాధ్యాయులందరి కృషి వలననే మేము ఇంత జ్ఞానాన్ని సంపాదించ గలిగామని అందరితో పంచుకున్నారు. ఉపాధ్యాయ బృందం విద్యార్థులకు జీవితంలో సాధించబోయే విజయాలకు ఎలాంటి కృషి చెయ్యాలో వివరించి జీవితంలో మనం ఎక్కడ ఉన్నా మన వ్యక్తిత్వాన్ని మరచి పోరాదని వివరించారు. శ్రీ ఆనందం మామయ్యగారు మాట్లాడుతూ ఈ ఆశ్రమాన్ని, ఈ పాఠశాలను పెట్టడానికి గల కారణాలను, దానికి వారందరూ ఎంత కృషి చేసారో చెప్పి ఆ కృషిని ఎప్పటికీ మీరందరూ గుర్తుంచుకోవాలని చెప్పారు.

చివరగా సాయిరామ చైతన్యగారు మాట్లాడుతూ సూర్యునికి సంబంధించిన శ్లోకాన్ని చెప్పారు. సూర్యుడి రథానికి ఒకటే చక్రం ఉంటుంది. మనం రెండు చక్రాలున్న సైకిల్‌నే సరిగ్గా నడపలేము. ఆ సూర్యరథానికి సరి సంఖ్య గల గుర్రాలు ఉన్నాయా అంటే ఏడు గుర్రాలు. రథాన్ని నడిపేవాడు నేర్పరి కలవాడా అంటే అతనికి తొడలే లేవు. రథం వెళ్ళేది ఆకాశంలో. మంచి రోడ్డా అంటే అదీ లేదు శూన్యంలో ప్రయాణిం చాలి. మరి సూర్యుడికి ఇన్ని ఇబ్బందులు ఉన్నా ఉదయించడం మానేస్తున్నాడా! లేదే! ఆయన పని ఆయన సక్రమంగా చేస్తున్నాడు. సమాన వెలుగును అందిస్తున్నాడు. మనం కూడా జీవితంలో ఎన్నో కష్టాలు వస్తాయి. వాటన్నింటిని తట్టుకొని గమ్యాన్ని చేరాలి. ఇకముందు మీరు చూడబోయేది రంగుల ప్రపంచం. ఆకర్షణీయంగా కనిపిస్తుంది. చూసిందల్లా కావాలనిపిస్తోంది. మీ మనసు వంకరగా ఆలోచించినప్పడల్లా ఈ పని వల్ల నా తల్లిదండ్రులకీ, నా పాఠశాలకీ మంచి పేరు వస్తుందా అని ఒకసారి ఆలోచించండి. ఇప్పడు మీరు తప్పటడుగులు వెయ్యలేరు. జీవితానికి లక్ష్యం ఉండాలి. నిర్లక్ష్యానికి, సోమరితనానికి తావివ్వరాదు. కృషి ఉంటే మనుషులు ఋషులౌతారు, మహాపురుషులౌతారు.

ఇక వీడ్కోలు విషయానికి వస్తే వీడ్కోలు పాఠశాల వాతావరణానికి మాత్రమే చెప్పండి. పాఠశాలలో నేర్చుకున్న మంచి ప్రవర్తనకు చెప్పకండి. మంచి దేశనాయకులను ఆదర్శంగా తీసుకోండని చెప్పారు.


చివరగా మూడు విషయాలు చెప్పారు. **క్రమశిక్షణ, ఆలోచన, ఆచరణ.** సరైన క్రమశిక్షణ ఉంటే మంచి ఆలోచనలు వస్తాయి. మంచి ఆలోచనలే ఆచరణకు దారులు వేస్తాయి. మీ జీవితాలకు మీరే కంచెలు వేసుకోవాలి. కాబట్టి ఆలోచించి అడుగులు వేయండి. ఎల్లప్పడూ బాబా వారి, గురుదేవుల, మాతాజీల ఆశీస్సులు ఎల్లప్పడూ మీకు ఉండాలని మనసారా కోరుకుంటున్నానని ముగించారు.

ఉపాధ్యాయులను పండు తాంబూలాలతో సత్కరించి వారి ఆశీస్సులు పొందారు విద్యార్థులు.





# శిష్య లక్షణాలు



**- శ్రీశ్రీశ్రీ సమర్థ రామదాస స్వామి "దాసబోధ" ఆధారంగా**

మంచి శిష్యుడు, మంచి గురువు - ఇద్దరూ జతపడితేనే లోకశ్రేయం. సారవంతమైన గింజలు ఊసర క్షేత్రంలో నాటితే ఫలించవు. అలాగే భూమి ఎంత సారవంతమైనా చచ్చు విత్తనాలు చల్లితే పంట సరిగా పండదు. (మంచి ముత్యం తయారుకావాలంటే స్వాతి వానచినుకు ముత్యపు చిప్పలో పడాలి. అది స్వాతి కార్తెలోని వానచినుకు కాకపోయినా -పడేది ముత్యపు చిప్పలో కాకుండా సముద్రంలోనో, ఇసుకమీదో, నేలమీదో ఎక్కడ పడినా వ్యర్థమే అన్నది మనకు అనుభవమే. అందుచేత గురుశిష్యులిద్దరూ యోగ్యులైనప్పడే పరమార్థం అన్నది చేకూరుతుంది. అయితే - మధ్యలో యింకొన్ని చిక్కులు కూడా ఉన్నాయి. నేలా, విత్తనం రెండూ మంచివే కానీ, సాగు సకాలంలో సాగాలి. అదునున వర్షం కురవాలి. అటుపైన కాపలా కూడా ఉండాలి. అలాగే సాధన అదునులో - పూర్తిగా జవసత్వాలు ఉడిగిపోకముందే ప్రారంభించటం అవసరం. తన సాధనలోని లోపాలు సరిచేసుకుంటూ, కలుపు మొక్కల్లాటి అవరోధాలు తొలగించుకుంటూ నడవాలి. గురు కృపా రసానికి పాత్రులు కావాలి. అంతా అయ్యాక పునరాలోచన, మననం తప్పనిసరి. మొత్తం మీద సద్గురువు చెంత ఉన్న శిష్యునికి అభ్యాసం, శాస్త్ర విచారం, సత్కర్మ, స్వధర్మ నిష్ఠ, సత్య నియమం, సదాచరణ ఇవన్నీ ఉన్నప్పడే విమలజ్ఞానం కలుగుతుంది.

శిష్యుని అత్యంత ముఖ్యధర్మం గురువు పట్ల అనన్యభావంతో కూడిన విశ్వాసం ఉంచటం, శిష్యుడు పవిత్రాత్ముడు, విరక్తాత్ముడూ, మోక్షాసక్తుడూ కూడా అయి ఉండాలి. ధైర్యశాలీ, పరోపకారీ, మాత్సర్యం లేనివాడూ, అవగాహన కలవాడూ అయి ఉండాలి. ప్రజ్ఞ, యుక్తి, నిత్యానిత్య విచారణ

శక్తి, సాత్త్వికత, ప్రేమ, మర్యాద - యివన్నీ శిష్యునికి కావలసిన లక్షణాలు.

అంతేకాక శరీర శ్రమకు ఓర్చుకొనే గుణం అతనికి చాలా అవసరం. పుట్టుక నుండీ సుఖభోగపరుడైనవాడు పనికిరాడు. ప్రపంచంలోని బాధలతో తపించి కృశించినవాడైతే - అట్టి వాని వైరాగ్యం దృఢంగా ఉంటుంది. గురూపదేశం పట్ల దృఢమైన విశ్వాసం ఉన్నవాడే మోక్షానికి అధికారి. అంటే మోక్షం పొందగల యోగ్యుడవుతాడు. గురువు కన్నా దేవతలు ఎక్కువని భావించేవాడు మూఢుడు. వాడు దేవతలు ప్రసాదించే వైభవాలకు, సామర్థ్యాలకు మురిసిపోయి శాశ్వత సత్యం నుండి దూరంగా తొలగిపోయినట్లు, సద్గురువును సామాన్య గురువులతోను, దేవతలతోను సమానంగా తలచే శిష్యుడు దురాచారి అనవచ్చు. సద్గురువు మాటల మీద దృఢవిశ్వాసం ఉన్న శిష్యుడు క్రమక్రమంగా తాను కూడా గురువు స్థాయికి చేరతాడు. సచ్ఛిష్యుడు సద్గురువుని శరణ్యాన్ని ఎన్నడూ విడవలేడు. అలాకాక వ్యతిరేక మార్గంలో - అంటే శిష్య వేషధారులై ఉండి కూడా గురువును అనుసరించని వారిని అసత్‌శిష్యులుగా - అంటే దొంగ శిష్యులుగా భావించాలి.

విషయసుఖాలు తొందరపెట్టగానే దుర్బలురైన శిష్యులు మళ్ళీ ఇంటివైపే పరుగులు తీస్తారు. దానితో సాధించిన కాస్త పరమార్థమూ నశించిపోతుంది. అంతటితో ఆగరు. ఈ పరమార్థం సాధించామన్న నెపంతో కుటుంబభారాన్ని సరిగా మొయ్యరు. చివరికి రెంటికి చెడిన రేవడలవుతారు. వాళ్లకు ప్రపంచంలో ఆనందం ఉన్నదన్న భ్రమ తీరదు. పైకేమో ఆధ్యాత్మిక వాదుల్లాగా నటిస్తారు. ఇలాటి వ్యక్తులకు బ్రహ్మజ్ఞానం గానీ, వివేకంగానీ బోధించాలనుకోవటం గురువులకు వృథా ప్రయాసమే. పందికి పరిమళలేపనం పూసినట్లు, గేదెకు చందనం పూసినట్లూ అవుతుంది. బొల్లి గ్రద్ధ రాజహంసల మధ్య చేరి వాటితో తానూ సమానమని ప్రేలాపనలు చేసినా, దాని మనసు శవాల మీద, అసహ్య






పదార్థాల మీదే ఉంటుంది. అలాగే ఇలాటి శిష్యులు సజ్జనుల మధ్యలో ఉండి తాను కూడా సజ్జనుడనిపించుకొంటున్నప్పటికీ అతని ఆంతర్యం మాత్రం విషయలాలసలతోనే నిండి ఉంటుంది. ఇటువంటి వారు గురువు ముందు తమ హృదయం పరిచి, తమ దోషాలకు క్షమార్పణ కోరి, గురుకృపకు పాత్రులు కాకపోతే నరకాల పాలవుతారు. అది కూడా ఏదో స్మశానవైరాగ్యంతో కాదు - నిర్మలచిత్తంతో వేడుకోవాలి.

కొందరు శిష్యులు ఒక గురువు దగ్గర చేరి వినయం చూపి ఒక మంత్రం గ్రహిస్తారు. మూన్నాళ్ల ముచ్చటగా ఆ గురుసేవ ముగించి మరోచోట చేరతారు. ఇలా అనేకుల దగ్గర చేరి ఏవేవో పాషండ పదాలు నేర్చుకొని అవే వాగుతూ పాషండులైపోతుంటారు. ఒక్కసారి ఏడుస్తారు - మరోసారి స్పృహ తప్పి పడిపోతారు. ఇంకోసారి తానే దేవుడిని అనే వేదాంతంతో, వాగాడంబరంతో ఏమేమిటో నటిస్తారు.

అల్పుడైన శిష్యుడు ఆకలిదప్పికలను సహించలేడు. నిద్రకు కాస్త కూడా ఆగలేడు. స్వసుఖాన్ని విడువలేడు. దయ, తృప్తి, సద్వృత్తి ఉండవు. శరీరాన్ని మాత్రం శ్రమ పెట్టుకోడు. అంటే - ఒళ్లు అలవనివ్వడు. సాంసారిక జనంతో సరళంగా ప్రవర్తించడు. పరులకు కలిగిన దుఃఖానికి ఆనందిస్తాడు. మాయ మాటలు చెప్పి చుట్టూ వారిని మోసగిస్తాడు. తన దుఃఖానికి ఏడుస్తూ, పరుల దుఃఖానికి ఆనందించే యిలాటి వారికి ఘోరనరకం తప్పదు.

పైన చెప్పిన దుర్గుణాలేమీ లేనివాడు మాత్రమే సచ్ఛిష్యుడు. అతడు తన గురుసేవ, దృఢభక్తి వలన స్వానంద సౌఖ్యం అనుభవిస్తారు. ఇలా సచ్ఛిష్యులుగా ఉన్నవారు తమ సాధనతోపాటు తమ గురువుల శ్రమను కూడా సఫలం చేయగలరు.



# దేశం - ధర్మం




- శ్రీశ్రీశ్రీ స్వామీ సత్యసదానంద ప్రభుజీ

ధర్మయేవ హతోహంతి, ధర్మో రక్షతి రక్షితః

ఇది అనాది ఆర్యోక్తి. ధర్మం శాశ్వతం, స్థిరం. దేశ కాల పాత్రలకు అతీతమైన ఒకానొక శక్తికే ధర్మం అని పేరు. దేశాలను బట్టి పైపై ఆచారాలు, సంప్రదాయాలు మారుతున్నట్లు కన్పిస్తాయిగానీ - మౌలికమైన ధర్మం వీటన్నిటికంటే ఉత్తమం, అతీతమున్నూ. ఇక దేశం అన్నది ఏవో కొన్ని సరిహద్దులకు, కొన్ని రకాల జీవనరీతులకు పరిమితమై ఉన్నట్టిది గదా! అలాంటప్పుడు యీ రెండింటికీ పోలిక పెట్టటం ఏమిటి? అనిపిస్తుంది. అయితే యివి పరస్పరాశ్రితాలుగా ఎలా ఉంటాయో పరిశీలిద్దాం.

ఈ మన భూగోళంపైన కొన్ని ప్రాంతాలలో ఆయా వాతావరణాలు - ఆ ప్రాంతాలలో పుట్టి పెరిగే జనుల మీద శారీరకంగాను, మానసికంగాను ప్రభావాన్ని చూపిస్తూ ఉండటాన్ని గమనిస్తాం. శీతల ప్రదేశాలలోని ప్రజలు ఎక్కువగా లౌకిక భావాలు కలిగి లోక వ్యవహారాలలో తగుల్కొని సుఖ భోగాలలో మునిగి తేలుతూ ఉండటం కన్పిస్తుంది. అతి ఉష్ణ ప్రదేశాలలో పుట్టి పెరిగే వారిలో క్రౌర్యమూ, మూర్ఖతా ఎక్కువ పాళ్లలో కన్పిస్తాయి. ఇక సమ సతోష్ణ మండలాలలోని వారిలో నాగరికతా, సంస్కృతే ఎక్కువ అభివృద్ధిలో కన్పిస్తాయి. అందునా మన భారతదేశంలోని గంగా, సింధూ, యమునా, సరస్వతీ, గోదావరీ, కృష్ణా మొదలైన పూజ్యనదీ తీరాలు అతి ప్రాచీన కాలం నుండి విశ్వసంస్కృతికీ, ధర్మానికీ పట్టుకొమ్మలుగా నిలిచాయి. ప్రపంచంలోని మిగతా ప్రదేశాలలో బట్టలు కట్టుకోవటమే తెలియని రోజులలో ఇక్కడ, మన పవిత్ర భారతదేశంలో గొప్ప సంస్కృతి వెలిసింది. వేదాలు, ధర్మశాస్త్రాలు ఆవిర్భవించినై, ఇది ఈ దేశపు ప్రత్యేకత.





ఈనాటి సప్తసింధు ప్రాంతమే వీటన్నింటికీ కేంద్రస్థానమై వెలిసింది. గ్రీకుల దండయాత్రల సమయానికి దురదృష్టవశాత్తూ సనాతన ధర్మానికి మూలస్తంభమైన, వేదాంతసారమైన, యావత్తు ప్రపంచానికి జ్ఞానదాత యైన భగవద్గీత బోధలు మరుగునపడటం వల్ల మన వేదభూమి కొంత కొంతగా దురాక్రమణలకు లోనౌతూ వచ్చింది. దీనికి కారణం మనలో ధర్మ దీక్ష, సామాజిక స్పృహ కొరవడటమే. ఎక్కడెక్కడ ఈ భారతమాత దురాక్రమణకు గురిఅయినదో అక్కడక్కడ ధర్మభ్రష్టత్వం జరుగుతూ వచ్చింది. క్రౌర్యం ప్రబలిపోతూ శాంతి నశిస్తూ వచ్చింది. ధర్మనాశకులు దేశాల్ని ఏదో విధంగా ఆక్రమించుకుంటూ అక్కడ క్రౌర్యాన్నీ, అశాంతినీ ప్రేరేపిస్తూ ఉంటారు. పూర్వం ఇలాంటి ధర్మవిరోధులనే రాక్షసులుగా పేర్కొంటూ 'యదాయదాహి ధర్మస్య గ్లానిర్భవతి భారత .... " అంటూ ఆ భగవానుడు రామకృష్ణాది అవతారాలు ధరించి, అటువంటి ధర్మద్రోహుల్ని ఈ భూభాగం నుండి తొలగించి, మన కర్తవ్యాన్ని బోధిస్తూ వచ్చాడు - ఈ పవిత్రభూమిని మళ్లీ ధర్మప్రచారానికి కేంద్రంగా స్థాపిస్తూ వచ్చాడు.

సమాజంలోని వ్యక్తులందరనూ ప్రేమభావనతో బంధించి వైయుక్తికంగాను, సామాజికంగాను సుఖశాంతులతో జీవింపజేసేది ధర్మం. ఇది విశ్వజనీనం. మాతృదేవోభవ, పితృదేవోభవ, ఆచార్య దేవోభవ, అతిథి దేవోభవ, అహింస, సత్యము, అజేయము మొదలైన ఉదాత్త భావాలతో జీవింపజేసేది ధర్మం.

భగవదారాధనా విధానాలలో భిన్న భిన్న మార్గాలను నిర్దేశించేవి మతాలు. ఇవి అధికభాగం వైయక్తికమే. ఎవడికి నచ్చిన మార్గంలో వాడు భగవంతుడని ఆరాధించుకోవచ్చు. దీనిని ఇంకొకరి మీద రుద్దవలసిన పని లేదు. బలవంతంగానో, ప్రలోభపెట్టో యిలా రుద్దటం అధర్మం. "అద్వేష్టా సర్వ భూతానాం మైత్రేః కరుణ ఏవచ" అని ఏ జీవిని కూడా ద్వేషించ వద్దు. మైత్రితోనూ, కరుణతోనూ చూడు అని చాటే సనాతన ధర్మం, ఈ

భారతీయ ధర్మం. ఎటువంటి అధర్మాన్ని సహించదు. మన రాజ్యాంగం కూడా మతాతీత రాజ్యాంగం (సెక్యులర్). ఈ భారతదేశం భారతదేశంగా నిలబడిననాడు, దురాక్రమణలను ఎదిరించి నిలిచిననాడు మాత్రమే ఈ విశ్వజనీన ధర్మం నిలబడుతుంది.

దేశం శరీరం వంటిది. ధర్మం ఆత్మ వంటిది. ఆత్మకు శరీరం ఎలా ఆధారమో, ధర్మానికి దేశం అలాగే ఆధారభూతమై ఉంటుంది. అంచేత ఈ మహత్తరమైన, విశ్వశాంతి కారకమైన ధర్మ రక్షణ కోసం దేశ రక్షణ అత్యంతావశ్యకం.

## భక్త కథాసుధ

# జనాబాయి

- ప్రభుజీ

**(గత సంచిక తరువాయి)**

తన స్వామి, పతి, ఏడుగడ అన్నీ అయిన ఆ పరంధాముని-అభంగాలలో కీర్తించింది. వాటి మాధుర్యానికి ముగ్ధుడై స్వామి అలాగే వింటూ కూర్చుండి పోయినాడు. ఏ మాత్రమూ చదువుకోని ఆ బాలిక అశువుగా అభంగాలు గానం చేయటం ఎవరి చలవ?

ఈ విధంగా ఒక భక్తాగ్రేసరుని గురువుగా భావించి ఆయన సామీప్యంలో నివసించటం వలన ఆమెకు భగవద్దర్శన భాగ్యం అడపా దడపా కలుగుతూనే ఉంది. ఉచ్ఛిష్టాన్నం తింటూ దాస్యవృత్తిలో కాలం గడిపే ఆమెను భగవానుడు ఈ విధంగా కరుణించటానికి కారణం ఆమె నిర్మల హృదయమూ, అనన్య భక్తీ కాక మరేమి కాగలదు. మనలో కూడా ఆ పరమాత్ముడు కోరేది వీటినే. ఆమె మనసారా ఆర్తితో పాడే అభంగాలను వినటానికి స్వామి సాకారంగా ఆమె చెంతకు వచ్చేవాడు.

ఒక సాయంత్రం నామదేవుని తల్లి గుణాబాయి, జనాబాయికి





మిక్కిలిగా జొన్నలు ఇచ్చి మరునాటికల్లా పిండి విసరమని చెప్పింది. జనాబాయి అర్ధరాత్రి లేచి తిరుగలి ముందు కూర్చొని జొన్నలు విసరటం ప్రారంభించింది. భగవన్నామ స్మరణ చేస్తూ తన సంచిత కర్మల్ని కూడా విసురుతోంది. మనసారా స్మరించినప్పుడు ఆ భగవానుడు పలకడా! హఠాత్తుగా అక్కడ ప్రత్యక్షమై తిరుగలి పిడితాను పట్టుకుని ఆమెను అభంగాలు పాడమన్నాడు. ఆమె ఎంత వారించినా వినకుండా తాను పిండి విసరటం ప్రారంభించాడు. భక్తుల కష్టాలను తన మీద వేసుకోవటం ఆ భక్త పరాధీనుడికి అలవాటే కదా! జనాబాయి పాడే అభంగ గానామృతాన్ని ఆస్వాదిస్తూ తెల్లవారుఝాము వరకూ అలాగే ఉండి పోయాడు. ఆ ప్రభాత సమయాన భక్తులు చంద్రభాగా తరంగాలలో స్నానమాడి రంగ రంగా అంటూ దైవ దర్శనానికై ఆలయంవైపు సాగిపోతున్నారు. దేవాలయ ప్రాంగణము నుండి సుప్రభాత మంగళ వాద్యాలు వినవస్తున్నాయి.

"స్వామీ! మీ దర్శనానికి వేలాది భక్త వరేణ్యులు ఆలయానికి వేంచేస్తున్నారు. అక్కడ మీరు కన్పించకపోతే తల్లడిల్లిపోతారు. నామూలంగా వారికి ఇబ్బంది కలగటం నేను సహించలేను. వేగంగా దేవాలయానికి వేంచేయరా!" అని ప్రార్థించింది.

హఠాత్తుగా స్వామి లేచాడు పిండి విసిరేటప్పుడు తీసి పక్కనపెట్టిన అమూల్యాభరణాలు, పట్టు ఉత్తరీయము అలాగే వదిలేసి జనాబాయి కప్పకొనే చినుగుల బొంతను మీద వేసుకొని అదృశ్యమైనాడు. స్వామి సంకల్పమేమో ఎవరికెరుక.

అక్కడ పూజారులు యథా సమయానికి ద్వారాలు తెరిచారు. స్వామి దివ్యమంగళ విగ్రహాన్ని కన్నులారా దర్శించారు. కాని అదేమి నిత్యము ధరించే ఆ అమూల్యాభరణాలు ఎక్కడ? పట్టు పీతాంబరాలు ఎక్కడ? వాటి స్థానంలో ఈ చినిగిన బొంత ఎక్కడిది?

**(సశేషం)**

# DECLARATION

Statement about ownership and other particulars about **"Sachidananda Sadguru Sai Vani".**

1. Place of publication : Hyderabad
2. Periodicity of publication: Monthly
3. Printer's Name : V.V. Krishna Rao
   Nationality : Indian
   Address : Sai Sri Printers, 8-3-945, Shop No. 21, Pancom Business Centre, Ameerpet, Hyderabad - 500 016 (A.P.)
4. Publisher's Name : Brahmachari Sai Ramachaitanya
   Nationality : Indian
   Address : Saidhamam, Yadadri Bhuvanagiri Dist,
   Pin - 508 126
5. Editor's Name : Brahmachari Sai Ramachaitanya
   Nationality : Indian
   Address : Saidhamam, Yadadri Bhuvanagiri Dist, Pin- 508 126
6. Owner's Name : Sachidananda Sadguru Sai Vani Publications, Saidhamam,
   Yadadri Bhuvanagiri Dist- 508 126

I, Brahmachari Sai Ramachaitanya declare that the particulars given above are true to the best of my knowledge and belief.

Date : 01-03-2019

Sd/-

Sai Ramachaitanya





# శ్రీ కోదండ రామ సాయి సన్నిధానం ఆశ్రమంలో

## జ్ఞానధామం-3 నిర్మాణం

**సాయిధామం సేవాశ్రమ అనుబంధ శాఖగా శ్రీ కోదండ రామ సాయి సన్నిధానం పేరిట గుంటూరు జిల్లా సత్తెనపల్లి పట్టణంలోని అబ్బూరు రోడ్డు 30వ వార్డు, రైల్వేగేటు దగ్గర ఈ ఆశ్రమం ఉన్నది. ధర్మ ప్రచార కేంద్రంగా, పరిసర గ్రామాల ప్రజలకు సేవలందించాలనీ, ప్రజలను దైవభక్తి, దేశభక్తి పరాయణులుగా తీర్చిదిద్దాలని పూజ్య గురుదేవుల సంకల్పం. వారి ఆశయాల మేరకు నడుస్తున్నది శ్రీ కోదండ రామసాయి సన్నిధానం ఆశ్రమం. పూజ్య గురుదేవులు ఈ ఆశ్రమ నిర్మాణంకోసం ఎంతో శ్రమించి తపించారు. చీకట్లో తడుముకుంటూ తిరిగే మన జీవితాలకు జ్ఞాన వాకిళ్లు తెరిచిన ప్రేమమూర్తి పరమ పూజ్యులు శ్రీశ్రీశ్రీ స్వామీ సత్యపదానంద ప్రభుజీవారు. సాయి సాయుధ్యం పొందిన పూజ్య గురుదేవులకు శ్రీ కోదండ రామసాయి సన్నిధానం ఆశ్రమంలో జ్ఞానధామం-3 (ధ్యాన మందిరం) పేరిట ఒక చిన్న మందిరం నిర్మించాలని గ్రామ ప్రజలు మరియు సాయి సేవా సమితి ట్రస్ట్ వారి నిర్ణయం మేరకు దాని నిర్మాణం ప్రారంభం కాబోతున్నది. దానిలో భాగంగా ఫిబ్రవరి 21, 2019న శంకుస్థాపన చేయాలని నిర్ణయం జరిగింది.**

**(నిర్మాణ వ్యయం సుమారు రూ.6 లక్షలు.)**

ప్రియ మిత్రులారా!

సమాజసేవకు కేంద్రంగా ఉండబోతున్న ఈ నిర్మాణ మహత్కార్యంలో పాలుపంచుకోవలసిందిగా సహృదయులు, సేవా

పరులు, దైవభక్తులను మనఃపూర్వకంగా ఆహ్వానిస్తున్నాం, ధన రూపంలో కానీ, వస్తురూపంలోకాని మీకు చేతనైనా విరాళాలను అందించవచ్చు.

**వివరాలకు :** చెక్కులు **Sri Sai Seva Samithi Trust** పేరిట పంపించవచ్చు. డొనేషన్స్ ఆన్‌లైన్ ద్వారా కూడా పంపించవచ్చు.

**అకౌంట్ పేరు - Sri Sai Seva Samithi Trust**

**అకౌంట్ నెంబరు - 62002652136**

**IFSC Code - SBIN0020639**

**SBI Keesara Branch**

మీరు డొనేషన్ పంపిన తరువాత మాకు మీ వివరాలు తెలియజేయ డానికి ఫోన్ నెం : **9440413455, 9848133565** లను సంప్రదించగలరు.

ప్రియ మిత్రులారా! కదలి రండి!! కలిసి రండి!!! చేయి విప్పి మీ సహకారం అందించండి. శ్రీ సాయిసేవలో పునీతులు కండి.

ఇట్లు

**సాయి సేవలో**

**ధర్మాధికారి**

**శ్రీ సాయి రామ చైతన్య**


**సాయి సేవా సమితి ట్రస్ట్,**

**సాయిధామం**

**సాయివాణి పాఠకులకు, శ్రేయోభిలాషులకు**

**మహాశివరాత్రి పర్వదిన శుభాకాంక్షలు**





**సాయిధామంలో**

# గురుదేవుల 80వ జన్మదినోత్సవం





ప్రియ సాయి బంధువులారా!

మళ్ళీ మనమందరం ఒక్కచోట కలిసి గురుదేవుల శ్రీచరణాలకు నమస్కరించుకొనే అవకాశం-అద్భుత తరుణం వచ్చింది. "చేజారినదీ ఇంకొకరోజు గురుపద దర్శన భాగ్యం లేక" అని విచారిస్తూనే ఉంటాం అప్పుడప్పుడూ మనస్సు కలత చెందినప్పుడంతా. మామూలు దినచర్యలలో మనకు గురుదర్శన భాగ్యం కలగటం కొంచెం కరువే. కానీ కొన్ని రోజులలో తప్పనిసరిగా ఆ భాగ్యాన్ని చేజిక్కించుకొని తీరాలి. అవి **గురుపూర్ణిమ, గురు జన్మదినం, మనం ఉపదేశం తీసుకున్న రోజు**-ఈ మూడూ అవి. అంచేత రానున్న **ఫాల్గుణ బహుళ విదియ మార్చి 22వ తేదీ శుక్రవారంనాడు మన పరమపూజ్య గురుదేవులు శ్రీశ్రీశ్రీ స్వామీ సత్యపదానంద ప్రభూజీ వారి 80వ జన్మదినం సందర్భంగా-సాయిధామం ఆశ్రమంలో జరగనున్న గురు జన్మదినోత్సవంలో** అందరం పాల్గొని తరిద్దాం, రండి.

ఆనాటి కార్యక్రమం ఇలా జరుపుకుందాం.

**మార్చి 22** ఉ.గం. 6-30 క్షీరాభిషేకం-శ్రీ సాయికి 108 కలశాలతో జలాభిషేకం

గం. 8-30 అష్టోత్తర శతనామ పూజ వివిధ పుష్పాలతో

గం.10-30 పూజ్య గురుదేవులకు అర్చన, గురుస్తుతి, 80 ఆకృతిలో పూల దీపాలంకరణ

గం.11-00 భక్తుల భావ పరంపర, భజన

గం.11-30 శ్రీ సాయిరామ చైతన్యగారిచే ప్రవచనం

గం.12-00 మహా హారతి

గం.12-30 గురుదేవులకు దక్షిణ, నమస్సులు


గం. 1-00 అన్నప్రసాద వితరణ

**ప్రేమతో ఆహ్వానిస్తూ,**

**గురుచరణ స్మరణతో,**

**ధర్మాధికారి, సాయిధామం**

బాలవాణి



# మువ్వల మురళి

- శుకవాణి

(గత సంచిక తరువాయి)

కామాక్షి నిట్టూర్చి "మన పరిస్థితి అంతా అయ్య వారికి తెలుసులే నాన్నా! నువ్వు తీసుకువెళ్లలేదని ఏమీ అనరులే! పోనీ! నేనే వచ్చి అయ్య వారితో చెప్తానులే, నువ్వూరికే బెంగపడకు, ఏం! పో-వెళ్లి ఆడుకో" అన్నది. మురళి మెదలకుండా లేచి ముందు వాకిట్లోకి వెళ్లిపోయాడు.

వాడికి మనసులో బాచీ మాటలే మెదలుతున్నాయి. తన జట్టు పిల్ల లందరి ముందూ తనొక్కడే వెర్రివాడైపోతాడు. అందరూ తనవైపు ఇలా ... ఇలా... చూస్తారు. ఛ! వాడికి కోపం వచ్చింది. విస్సురుగా ముఖం పైకి పడుతున్న జుట్టు పైకి నెట్టుకొని యింట్లోకి వెళ్లాడు మళ్లీ. హఠాత్తుగా వాడి చూపు కిటికీలో ఉన్న వేణువుపై బడింది. ఒక్క క్షణం తరువాత వాడి కళ్లలోకి కాంతి పొంగివచ్చింది. చటుక్కున వెళ్లి వేణువును చేతిలోకి తీసుకున్నాడు. బయటకు వచ్చాడు. అప్పటికే మధ్యాహ్నం రెండు గంటలు దాటిపోతోంది.

✡ ✡ ✡

మురళి నడుస్తున్నాడు. ఒక చేతిలో వేణువుంది. రెండో చేత్తో మధ్య మధ్య జుట్టు సవరించుకుంటూ నడుస్తున్నాడు. ఊరు దాటి అడవి దారి పట్టాడు. అప్పడిక మెల్లగా వేణువు ఊదటం మొదలుపెట్టాడు. అది మామూలుగానే కీకీ, పీపీ అంటోంది. మురళికి మనసంతా తాను కలుసుకోబోయే కృష్ణయ్య మీదనే ఉంది. తన వేణువు కృష్ణుడికి వినపడు తుంది. తాను పిలవగానే ఆయన పరుగున వస్తాడు. తను చెప్పింది వింటాడు-తనకు కాలవలసిందిస్తాడు. దాదాపు గంటసేపు నడిచాక





మురళి అడవిలోకి ప్రవేశించాడు. వాడికి భయం వెయ్యనేలేదు. వేణువు ఊదుతూనే ఉన్నాడు. హఠాత్తుగా వాడి వేణువు అద్భుతంగా పాడసాగింది. ఇది గమనించిన మురళి పొంగిపోయాడు. "ఇంత బాగా పాడుతోంటే కృష్ణుడెందుకు పలకడూ!" అనుకున్నాడు. అలా అలా వాడు అడవి మధ్యకు చేరుకున్నాడు. కాస్సేపు వేణువు ఊదటం ఆపి "కృష్ణా కృష్ణా!" అని పిలుద్దా మనుకున్నాడు. కానీ, అమ్మ చెప్పిందిగా, బాగా వాయిస్తే ఆయనే వస్తాడని" అనుకున్నాడు. కాళ్లు నొప్పి పెడుతున్నాయి. అలసిపోయాడు. అయినా నడుస్తున్నాడు.

అంతలో దూరంగా చెట్టు క్రింద ఎవరో ఉన్నట్లు కనిపించింది మురళికి. గబగబా అటు నడిచాడు. చుట్టూ ఆవులు, దూడలు - మధ్యలో కూర్చొని ఉన్నాడు ఒక అబ్బాయి. తనంతే ఉన్నాడు. నల్లగా, కొంచెం లావుగా ఉన్నాడు. పెద్ద కళ్లు, జుట్టు పైకి కట్టుకున్నాడు. వేణువు ఊదుతున్నాడు. ఎంత బాగా ఊదుతున్నాడో, మురళికి అర్థమైపోయింది. అడవిలోకి వచ్చిన దగ్గరినుంచీ తనకు వినిపిస్తున్నది యీ వేణువే. తనింకా తన వేణువే అంత బాగా పాడుతున్నదనుకున్నాడు. మురళి కాస్త ముందుకువెళ్లాడు. ఆ అబ్బాయి పాట ఆపి తల తిప్పి చూశాడు - స్నేహంగా నవ్వుతూ.

"నీక్కూడా వాయించటం వచ్చా?" అని అడిగాడు మురళి చేతిలోని వేణువువైపు చూపిస్తూ.

"నీ అంత బాగా రాదు" అన్నాడు మురళి కాస్త సిగ్గుగా. "ఏదీ నీ పిల్లలగ్రోవి భలే బావుందే - చూడనివ్వు - మువ్వలు కూడా ఉన్నాయే" అంటూ వేణువు తీసుకొని పరిశీలిస్తూ - "ఇంతకీ నీ పేరేమిటి?" అన్నాడు. మురళి చెప్పాడు. ఆ అబ్బాయి పక్కున నవ్వి "భలే బావుంది .... నువ్వు మురళివి. నీది మువ్వల మురళి" అన్నాడు. మురళి ఏం మాట్లాడకుండా ఆ పిల్లవాడి నవ్వే చూస్తూ నిల్చుండిపోయాడు. అదేం నవ్వు! ఒక్క క్షణంలో పెదాలు చెంపలు, కళ్లు మొత్తం తళుక్కుమని మెరిసిపోయే నవ్వు -

ముత్యాలు రాలుతున్నట్లున్న నవ్వు! అసలా మాటకొస్తే ఆ నవ్వుకూ అతని వేణువు పాటకూ తేడా లేనట్లే ఉంది. ఆ అబ్బాయి "ఇది నేను ఊదనా!" అని అడుగుతూనే మువ్వల మురళిని పెదవికి ఆనించుకున్నాడు. ఎంత-ఒక్క క్షణం. అంతే సన్నని వేణుగానం అలా అలా గాలి అలల మీద మెల్ల మెల్లగా సాగి అడవినంతటినీ మైమరపింపసాగింది. మురళి తెల్ల బోయాడు- తన వేణువు ఎంత బాగా మోగుతోంది! ఈ అబ్బాయికి ఎంత బాగా వచ్చో! తానెవరో, ఎందుకక్కడికి వచ్చాడో మురళి మర్చేపోయాడు. పెరుగూ, పూజా, తల్లీ, బడి-వాడి మెదడులో ఏమీ లేవు, పాట పాట! ముగ్ధుడై అలా ఎంతసేపున్నాడో!

"ఇంతకీ నువ్వీ అడవిలోకి ఎందుకు వచ్చావు?" ఆ అబ్బాయి ప్రశ్నతో మళ్ళీ యీ లోకంలోకి వచ్చిపడ్డాడు మురళి.

"నేనా! నేనూ - క్రిష్ణుడి కోసం వచ్చాను. నీకు తెలుసా ఎక్కడుంటాడో?" అన్నాడు.

"క్రిష్ణుడా! ఇప్పటిదాకా యిక్కడే ఉన్నాడు. ఇప్పుడే ఎటో వెళ్ళాడు. నీకు వాడితో పనుందా?" అని అడిగాడా అబ్బాయి. మురళికి తన క్రిష్ణుడికి 'వాడు' అనటంతో కుతూహలం కలిగింది. "నీకు క్రిష్ణుడు బాగా తెలుసా?" అని అడిగాడు.

"తెలియటం ఏమిటీ? వాడు నా జతగాడేగా! అసలు శ్యాముడన్నా క్రిష్ణుడన్నా ఒక్కటే అన్నంత సావాసం మాకూ తెలుసా?" అన్నాడాబ్బాయి. "శ్యాముడెవరూ?" మురళి ప్రశ్న విని ఫక్కున నవ్వాడతను.

"నేనే! కనపడటంలా! నేను నల్లగా ఉంటాను గదా! అందుకని నన్నందరూ శ్యాముడంటారు - అవునూ - యింతకీ కిష్టుడితో నీకేం పనో చెప్పనే లేదేం!" అన్నాడు శ్యాముడు.

మరళి కొద్దిగా తటపటాయిస్తూనే తన సంగతంతా చెప్పాడు. శ్యాముడు అంతా శ్రద్ధగా విన్నాడు. ఎంతో ప్రేమగా, ఇంకెంతో దయగా





మురళి చేతిని పట్టుకొన్నాడు. "కాస్త పెరుగు కోసం యింత దూరం వచ్చావా?" అన్నాడు మెత్తగా. అదేం చిత్రమో - శ్యాముడు తనను తాకగానే అలసటా, కాళ్లనొప్పి మొత్తం మాయమైపోయాయి మురళికి-చిన్నగా నవ్వాడు శ్యాముడు.

"కిష్టుడు మళ్లీ యిప్పుడు రాడా?" అని అడిగాడు మురళి.

ఏమో మరి. అయినా నీకు కావలసింది పెరుగేగా! నేనిస్తాలే! దిగులు పడకు. సరేలేగానీ, నీకు అల్లో నేరేడు పళ్లిష్టమేనా? తింటావా?" అంటూ తన నడుముకు కట్టిన బట్టలోకి తన వేణువు దోపేసుకుని, చెట్టు క్రిందున్న చిన్న బుట్టలో నుంచీ పళ్లు తీసి మురళి చేతిలో పోసాడు.

"చాలా బాగుంటాయి. మా రాధమ్మ తెచ్చిచ్చింది పొద్దున. తిను" అన్నాడు తనొకటి కొరుకుతూ.

"రాధమెమ్మవరు?" అని అడిగాడు మురళి పండు తింటూ . నిజంగానే ఆ పండు చాలా బావుంది.

"రాధమ్మా! మా యింటి దగ్గరే ఉంటుందిలే! తను తెస్తేనే యివింత బావుంటాయి. ఇంకెవరు కోసినా ఇలా ఉండవు. మనం కోసుకున్నా సరే! ఇంకొంచెం తింటావా?" శ్యాముడు మరికాసిని పళ్లు మురళి చేతిలో పెట్టాడు. మురళి తింటుంటే వాళ్ల ఊరి కబుర్లు చెప్పాడు. మురళి శ్యాముడి పాటని మెచ్చుకున్నాడు. మరోసారి వేణువు వాయించమని కోరాడు. శ్యాముడు అలాగే వాయించాడు. అలా కొంతసేపయ్యాక మురళి "ఇంక వెడతాను" అని లేచి నిల్చున్నాడు.

"ఒక్క నిముషం ఆగు" అంటూ శ్యాముడు చెట్టు వెనక్కి వెళ్లి ఒక పెరుగు ముంతతో వచ్చాడు. అది చూచి మురళి కాస్త నిరాశపడ్డాడు. అది చిన్న ముంత. మహా అయితే పావుశేరుంటుందేమో! మురళి ముఖం చూచి శ్యాముడు నవ్వి.

**(సశేషం)**

# అందరికీ స్మార్తము నేర్పబడును

పవిత్రాత్మ స్వరూపులారా! రోజురోజుకీ దేవాలయాల సంఖ్య పెరుగుతున్నది. కాని బ్రాహ్మణోత్తములందరూ పౌరోహిత్యం చేసుకోవడానికి మొగ్గు చూపుతున్నారే తప్ప, దేవాలయాల్లో అర్చకులుగా ఉండటానికి ఇష్టపడటం లేదు. దేశ కాల పరిస్థితులను బట్టి కనీసం స్మార్తం వరకైనా అందరూ నేర్చుకొంటే గానీ దేవాలయాలల్లో నిత్య పూజ కైంకర్యాదులు జరిగి హిందూ దేవాలయాలు కలకలలాడజాలవు.

మానవమాత్రులందరూ అన్ని విద్యలూ నేర్చుకొనటకు అర్హులేనన్న నినాదాన్ని ఆంధ్రజాతికి ఏనాడో అందించాడు సద్గురు మహర్షి మలయాళ స్వాముల వారు. ఆ స్ఫూర్తితోనే తిరుపతి, శ్రీనివాస మంగాపురంలో శ్రీ వశిష్టాశ్రమ, శ్రీ లలితాపీఠ సంస్థాపకులైన పూజ్య పాద స్వస్వరూపానంద గిరి స్వాముల వారి ద్వారా అన్ని వర్ణముల వారికి వేద విద్యనందించుటకై స్మార్త పాఠశాల ప్రారంభింపబడినది. ప్రస్తుతం ఈ పాఠశాలలో 6 మంది విద్యార్థులు, స్మార్తం చెప్పే ఒక అధ్యాపకులు కలరు. కావున శ్రద్ధ కల హిందూ ధర్మాభిమానులైన తల్లిదండ్రులు తమ పిల్లలను మంచి సంస్కారవంతులుగా తీర్చిదిద్దుటకై పంపించవలసినదిగా కోరుచున్నాము.

**అర్హతలు :** 1) 5వ క్లాసు పాసయి ఉండాలి.

2) 10 సం.ల నుండి 16 సం.లోపు పిల్లలకు మాత్రమే.

**సౌకర్యములు :** 1) పిల్లలకు భోజన, వసతి వగైరా సౌకర్యములు ఉచితముగా కల్పించబడును.

2) 5 సం. కోర్సు పూర్తి చేసిన పిల్లలకు రూ.50,000/- పైకము ముట్టజెప్పబడును.

3) అవకాశమును బట్టి డైరెక్ట్ 10వ తరగతి పరీక్షలు వ్రాయించబడును.





**నేర్పబడు విషయములు :** సకల దేవతా షోడశోపచార పూజా విధానములు, పంచ సూక్తములు, సత్యనారాయణాది సకల వ్రతములు మరియు నోములు, సకల దేవతా హోమ(యజ్ఞములు), శంకుస్థాపన, గృహ ప్రవేశ, చౌల, ఉపనయన, వివాహాది విధి విధానములన్నియు నేర్పబడును.

**ఇట్లు**

**శ్రీ వసిష్ఠాశ్రమము**

**శ్రీ లలితా పీఠం ట్రస్టు**

**శ్రీనివాస మంగాపురం, తిరుపతి**

**సెల్ : 8639473567, 9440486392**

---

**సాయి సేవక్**

# శ్రీ శివనేశన్ స్వామీజీ జీవిత చరిత్ర

**(గత సంచిక తరువాయి)**

ఫ్రాన్సిస్ డేవిడ్ మన స్వామీజీకి ధ్యానం చేసుకొనేటప్పుడు ఆశీనుడగుటకు ఒక టవలు, 'సీక్రెట్స్ ఆఫ్ వేదాంత' అనే గ్రంథాన్ని బహూకరించెను. ఒకరోజు స్వామీజీ ఆ టవలు మీద ఆశీనులై ధ్యానము గావించుచుండగా డేవిడ్ మత్తు పదార్థములు సేవిస్తున్నట్లు అనుభూతి కలిగి డేవిడ్‌ను ప్రశ్నించగా అతను నిజమేనని అంగీకరించెను.

మరొక పర్యాయం స్వామీజీకి స్వప్నంలో మేడ మెట్ల మీద పైన స్వామీజీ, మధ్యన డేవిడ్, క్రింది భాగాన పచ్చని చీర ధరించిన స్త్రీ గల దృశ్యము కనిపించినది. ఆ స్వప్నంలో స్వామీజీ డేవిడ్‌ను పైకి లాగుతుండగా ఆ స్త్రీ అతనిని క్రింది వైపుకు లాగుతున్నది. కొంతకాలం తరువాత స్వామీజీ డేవిడ్ ఇంటికేగగా తనకు స్వప్నంలో కనిపించిన స్త్రీని అక్కడ గాంచి అచ్చెరువొందెను. అంతలోనే డేవిడ్ అక్కడకు వచ్చి ఆమె తన

భార్యయని పరిచయము చేసెను. ఆ స్వప్న వృత్తాంతాన్ని బట్టి స్వామీజీ డేవిడ్‌ను ఉచ్ఛస్థితికి తీసుకువెళ్లటానికి ప్రయత్నించుచుండ అతని భార్య అతనిని సంసార సాగరంలోనికి లాగుతున్నట్లు స్పష్టమగుచున్నది.

స్వామీజీ ఒక రోజు డేవిడ్‌ను తమ గురువు గార్కి పరిచయము చేయగా ముత్తయ్యగారు స్వామీజీతో అతని వ్యక్తిత్వం మంచిది కాదని తెలియజేయగా స్వామీజీ డేవిడ్‌కు దూరంగా మెదలసాగెను.

స్వామీజీ ఏ విధమైన సంపాదన లేక సతమతమౌతుంటే ముత్తయ్య గారు స్వామిని చేరదీసి తమ ఇంట్లోనే వసతి నేర్పరచి భోజన సౌకర్యము కల్పించెను. ఎల్లప్పుడు కష్టించి పనిచేసే స్వామీజీ, ఇతరులకు భారం కాకూడదన్న తలంపుతో గురువు గారింట్లో వంట వండటం, గురువుగారి బట్టలుతుకుట మొదలగు పనులు చేసెడివారు. ఏ పని చేయుచున్నను భగవన్నామస్మరణాన్ని మనస్సులోనే మననం చేసుకుంటూ మనస్సును దైవం మీద లగ్నం చేసేవారు. వంట చేసేటప్పుడు సహితం గరిటను 'ఓం' ఆకారంలో త్రిప్పతూ వంటకాలను కలియపెట్టేవారు. స్వామీజీకి వంట చేయటం రాకున్నను ఆ ప్రక్రియ వలన వంట ఎంతో రుచిగా ఉండెడిది. గురువుగారు సహితం స్వామీజీ చేతి వంటకాన్ని మెచ్చుకునేవారు.

స్వామీజీ వారి గురువుగారిపై ఆర్థిక భారాన్ని మోపటం ఇష్టపడక వారికి ఆర్థికంగా చేదోడువాదోడుగా నిలవాలని తలచి మాతుంగ పోస్టాఫీసు దగ్గర ఫుట్‌పాత్ మీద కూర్చొని అక్కడకు వచ్చే నిరక్షరాస్యులకు ఎం.ఓ.లు నింపటం, ఉత్తరాలు వ్రాయటం లాంటి పనులు చేసి వారిచ్చినది స్వీకరించేవారు. 'ఇంతివ్వమని' నిర్బంధించేవారు కాదు. ఆ విధంగా సంపాదించిన డబ్బును గురువు గారికే సమర్పించేవారు. ఆ పోస్టాఫీసుకు ఎక్కువగా ఉత్తరప్రదేశ్ నుంచి వలస వచ్చిన 'భయ్యా'లనే నిరక్షరాస్యులు వచ్చేవారు. వీరు బొంబాయిలోని వివిధ కర్మాగారాలలో కూలి పనిచేస్తూ జీవనాన్ని సాగించేవారు. వీరి అమాయకత్వాన్ని ఆసరాగా తీసుకుని





అందరూ మోసగించేవారు. సత్యాన్ని, న్యాయాన్ని నమ్ముకొని జీవనం సాగిస్తున్న స్వామీజీ వారికి జరుగుతున్న అన్యాయాన్ని వివరించి ఆ మోసగాళ్లతో తగవు పడటం ఇష్టం లేక ఆ ప్రదేశాన్ని విడనాడారు.

స్వామీజీ పరిస్థితి మళ్ళీ మొదటికి వచ్చింది. ఆ తరువాత అతి కష్టం మీద 'శాంతి కాటన్ అండ్ సింథటిక్' మిల్లులో దినభత్యం మీద కూలిపని సంపాదించుకున్నారు. ఆ మిల్లులో స్వామీజీ మూడవ షిఫ్టు (అర్థరాత్రి నుంచి తెల్లవారే వరకు)లో పనిచేసేవారు. స్వామీజీ ఒక చిన్న గదిని బాడుగకు తీసుకొని అందులో నివసించసాగారు. ప్రతి నిత్యం ఉదయమే గురువుగారిని దర్శించుకొని వారి ఆశీర్వాదాన్ని తీసుకొని ఆధ్యాత్మిక పరమైన అనేక విషయాలను నేర్చుకునేవారు. ఆ ఉద్యోగం చేస్తున్న సమయంలోనే స్వామీజీకి సునీల్ అనే బెంగాలీ వ్యక్తితో పరిచయమేర్పడింది. సునీల్ ఏ ఉద్యోగం లేక బాధపడుతుంటే నిరుద్యోగంలో ఉన్న కష్టనష్టాలను చవిచూచిన స్వామీజీ అతని పరిస్థితికి జాలిపడి అతనిని తనతోనే ఉంచుకొని అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేసారు. సునీల్ స్వామీజీ ఇచ్చిన డబ్బుతో జల్సాలు చేస్తూ ఏ పనిచేయక కాలక్షేపం చేసేవాడు. చుట్టుప్రక్కల వారితో అసభ్యంగా ప్రవర్తించేవాడు. ఇతని సోమరితనాన్ని, అసభ్య ప్రవర్తనను చుట్టుప్రక్కల వారంతా స్వామీజీ దృష్టికి తీసుకెళ్లగా 'అతను కష్టాలలో ఉన్నాడు సాటి వారు కష్టాలలోనున్నప్పుడు ఆదుకొనుట మానవ ధర్మం' అని చెప్పి వారందరిని ఒప్పించారు. సునీల్‌కుమార్ ముసల్మానని అతని నామధేయం హుస్సేన్ అని తెలుసుకున్న చుట్టుప్రక్కల వారు నిలదీయగా అతను అక్కడ నుండి పలాయనం చిత్తగించాడు. సునీల్‌కుమార్ చర్య స్వామీజీని కృంగదీసింది. అతను కష్టాలలో నున్నాడు ఎక్కడకు పోతాడు? ఎలా జీవనం సాగిస్తాడన్నదే స్వామీజీ బాధకు కారణం. సునీల్ అసత్యం చెప్పినను, ఇరుగుపొరుగు వారితో అసభ్యకరంగా ప్రవర్తించినను స్వామీజీకి ఆగ్రహం కలుగకపోగా అతనిపై ఆయనకు కరుణయే కల్గినది. **(సశేషం)**